షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL/2023/89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 328 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 14 అక్టోబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 328 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 14 October 2024 PAGES : 8 PRICE : 5/-

# సర్కారుకు భారీ ఆదాయం

- ఏపీ వ్యాప్తంగా మద్యం దుకాణాలకు 89,882 దరఖాస్తులు..
- టెండర్ల ద్వారా ఏపీ ప్రభుత్వానికి ఏకంగా రూ.1797.64 కోట్ల ఆదాయం
- ప్రతి షాపునకు 25నుంచి 26 అప్లికేషన్లు వచ్చినట్లు తెలుస్తోంది.
- ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు ఏకంగా 5,800 దరఖాస్తులు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా 3396 మద్యం షాపుల కోసం మొత్తం 89,882 దరఖాస్తులు వచ్చాయి. మద్యం టెండర్ల ద్వారా ఏపీ ప్రభుత్వానికి ఏకంగా రూ.1797.64 కోట్ల ఆదాయం వచ్చింది. అక్టోబర్ 16 నుంచి రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలు చేయాలని ఏపీ -ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానించగా రికార్డుస్థాయిలో వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన దరఖాస్తుల ప్రకారం ప్రతి షాపునకు 25నుంచి 26 అప్లికేషన్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు ఏకంగా 5,800 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా పరిధిలో ప్రతి షాపునకూ 50నుంచి 51 దరఖాస్తులను టెండర్ దారులు దాఖలు - మిగతా3లో




### టీడీపీ ఆఫీసుపై దాడి, చంద్రబాబు నివాసంపై

# దాడి కేసులు సీఐడీకి అప్పగింత

**కేసుల విచారణ వేగవంతం చేసేందుకు వీలుగా సీఐడీకి కేసుల బదలాయింపు**

**ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి పీఎస్ ల పరిధిలో కేసుల దర్యాప్తు**

**రేపు సీఐడీకి ఈ కేసుల ఫైళ్లు అప్పగించనున్న మంగళగిరి డీఎస్పీ**

టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి, చంద్రబాబు నివాసంపై దాడి కేసులను ఏపీ ప్రభుత్వం సీఐడీకి అప్పగిస్తోంది. ఈ కేసుల విచారణ వేగవంతం చేయడానికి సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కేసుల విచారణ జరుగుతోంది. తాజాగా ప్రభుత్వం నిర్ణయం నేపథ్యంలో, ఈ కేసుల విచారణను సీఐడీకి బదిలీ చేయనున్నారు. రేపు (అక్టోబరు 14) ఈ కేసుల ఫైళ్లను మంగళగిరి డీఎస్పీ సీఐడీకి అప్పగించనున్నారు.



# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

- ఏపీకి భారీ వర్షాలు!
- నెల్లూరు జిల్లాకు వాన గండం... కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఏపీ దక్షిణ కోస్తా జిల్లాల్లో నాలుగు రోజుల పాటు వర్షాలు
- భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ
- అప్రమత్తమైన నెల్లూరు జిల్లా అధికార యంత్రాంగం

**అమరావతి**

రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తిరోగమించనున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, అస్సాం, మేఘాలయలోని మిగిలిన ప్రాంతాల నుంచి అలాగే అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, మహారాష్ట్రలోని మరికొన్ని - మిగతా3లో

### కనకదుర్గ దసరా మహోత్సవాలు

# వైభవంగా నిర్వహించాం

- మన పండుగలు కేవలం ఉత్సవాల నిర్వహణకే కాదు
- మన సంస్కృతి, సాంప్రదాయాలకు, వారసత్వానికి నిదర్శనం
- భక్తులకు సౌకర్యాలు పెంచడంతోపాటు దేవాలయాల పవిత్రతను , సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది



**అమరావతి**

ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ దసరా శరన్నవరాత్రి మహో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మద్యమం ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు. ఇంద్రకీలాద్రిపై విజయవాడ కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఈ ఏడు నిర్వహించామని, భక్తులకు పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం కలిగేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మన పండుగలు కేవలం ఉత్సవాల నిర్వహణకే కాదని... మన సంస్కృతి, సాంప్రదాయాలకు, వారసత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు పెంచడంతోపాటు దేవాలయాల పవిత్రతను , సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే తిరుమల తిరుపతిలో సాలకట్ల బ్రహ్మోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసిన తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అభినందిస్తున్నామన్నారు. తిరుమలలో ఏడాదికి 450 పండుగలు నిర్వహిస్తామని, వాటన్నింటిలోకి బ్రహ్మోత్సవం విశిష్టమైనదని - మిగతా3లో



## 75 మంది వైద్యుల మూకుమ్మడి రాజీనామాలకు రెడీ

- దీదీ దిగిరావాలని డిమాండ్
- ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని వారు హెచ్చరిక
- కళ్యాణి జేఎన్ఎంకు చెందిన 75 మంది సీనియర్ వైద్య బృందం నిరసనకారులకు మద్దతు
- కోల్ కతా హత్యాచార ఘటన తమను మానసికంగా దెబ్బ తీసింది
- ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలి



## గుజరాత్‌లో ఘోర ప్రమాదం

- ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో కూలిన గోడ, మట్టి దిబ్బలు..
- 9 మంది కూలీలు మృతి
- మృతులంతా 20 నుంచి 30 ఏళ్ల వయస్కులు, ఇద్దరు మహిళలు ఉన్నారు
- మరణించిన వారిలో ఎక్కువ మంది గుజరాత్‌లోని దాహొూద్‌కు చెందినవారు, రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు కూలీలు కూడా ఉన్నారు

# రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి..



- యువగళంలో ఇచ్చిన మరో హామీని ప్రభుత్వం నెరవేర్చింది: మంత్రి నారా లోకేశ్
- వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని విజ్ఞప్తులు వచ్చాయన్న లోకేశ్
- బోయ, వాల్మీకి సామాజిక వర్గీయులు తనను కోరారని వెల్లడి
- ఈ నెల 17న అన్ని జిల్లాల్లో వాల్మీకి జయంతి వేడుకలు
- ఆ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయన్న లోకేశ్

**అమరావతి**

యువగళం పాదయాత్రలో తాను ఇచ్చిన మరో హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని బోయ, వాల్మీకి సోదరులు యువగళం పాదయాత్రలో తనను కలిసి విన్నవించారన్నారు. వారి సెంటిమెంటును గౌరవిస్తూ వాల్మీకి జయంతిని ఈనెల 17వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, అదే రోజు అనంతపురంలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతిని నిర్వహిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ బీసీల పుట్టినిల్లని.. వారి ఆత్మ గౌరవాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని నారా లోకేస్ పేర్కొన్నారు. కాగా రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 17న అన్ని జిల్లాల్లోనూ వాల్మీకి జయంతి అధికారికంగా - మిగతా3లో

# గెలిస్తే తమ గొప్పా... ఓడిపోతే ఈవీఎంల తప్పా...

**విజయవాడ :** ఓటమి చెందితే కాని ఈవీఎంలలో తేడా ఉన్నట్లు అర్థం కాదా? ఖచ్చితంగా తాము గెలుస్తామని భావించి ఓటమి పాలయితే దానిని ప్రజాభిప్రాయం కింద పరిగణనలోకి తీసుకోవడం లేదు మన నేతాశ్రీలు. గెలిస్తే అది మన వల్లనే అని జబ్బలు చరుచుకుంటారు. లేదంటే అవతలి వారిపై అసంతృప్తి అని చెబుతారు. అదే గెలవకుంటే మాత్రం అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించరు. నాడు చంద్రబాబు నాయుడు, నేడు వైఎస్ జగన్ ది అదే పరిస్థితి. ఎందుకంటే వారు గెలుపోటములను వెంటనే తీసుకోరు. ఆ తప్పిదాన్ని ఈవీఎంలపై నెట్టి తాము చేసిన తప్పులను మాత్రం ప్రజల దృష్టి నుంచి మరల్చేందుకు ఎక్కువ సార్లు కామెంట్స్ చేస్తుంటారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కేవలం 23 స్థానాలకే పరిమితమయింది. నిజానికి ఇంత తక్కువ స్థానాలు టీడీపీ చరిత్రలోనే రాలేదు. ఎన్నికలకు ముందు పసుపుకుంకుమలు ఇచ్చామనుకున్నారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పరుగులు పెట్టించామని భావించారు. కానీ ఓడిపోవడంతో చంద్రబాబు ఈవీఎంలను తప్పు పట్టారు. నాడు చంద్రబాబు ఒంటరిగా పోటీ చేశారు. పవన్ కల్యాణ్, బీజేపీలు వేర్వేరుగా బరిలో ఉన్నారు. కానీ జగన్ కు ఒకసారి ఇవ్వాలని భావించిన ప్రజలు ఫ్యాన్ పార్టీకే పట్టం కట్టారు. 151 స్థానాలను చరిత్రలో తొలిసారి ఒక పార్టీకి కట్టబెట్టి ఏకపక్ష తీర్పు చెప్పారు. దీంతో ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు మైండ్ బ్లాంక్ అయి ఈవీఎంలలో ఏదో తేడా ఉందన్నారు. టీడీపీ సోషల్ మీడియా కూడా అదే తరహా ప్రచారం చేసింది. 2024 ఎన్నికలు ఇప్పుడు వైఎస్ జగన్ కూడా అదే రాగం మొదలు పెట్టారు. వైసీపీకి మొన్నటి ఎన్నికల్లో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో వైఎస్ జగన్ నింద



ఈవీఎంలపై నెట్టేశారు. ముందస్తు, ఎన్నికల అనంతరం సర్వేలు కూడా తమకు అనుకూలంగా వస్తే తాము ఎలా ఓడిపోగలమని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఈవీఎంలు కారణం అంటూ ఆ పార్టీ చేస్తున్న వాదనకు జగన్ కూడా మద్దతుగా నిలిచారు. బ్యాలట్ విధానమే మంచిదని అన్నారు. ప్రజాభిప్రాయం ప్రతిబింబించాలంటే ఇతర దేశాల మాదిరిగా బ్యాలెట్ పేపర్లను వినియోగించాలన్నారు.. ఇరువురు నేతలు ఒకసారి ఓడి మరొకసారి గెలిచిన వాళ్లే. ఇద్దరూ ప్రాంతీయ పార్టీలకు చీఫ్‌లే. నాడు గెలిచినప్పుడు ఈవీఎంలు బాగా పనిచేశాయని కితాబిచ్చిన నేతలు ఓటమి తర్వాత మాత్రం అవి మంచివి కావంటున్నారు. నిజానికి ఇద్దరూ తాము చేసిన స్వయంకృతాపరాధం వల్లనే ఓటమి పాలయ్యారు. అవతలి వారు గెలిచారు. అంత మాత్రాన ఎన్నికల కమిషన్ పై బురద జల్లడం ఎంత వరకూ సబబన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మాత్రం కేంద్ర ఎన్నికల కమిషన్ దే. ఎందుకంటే నెపం నెట్టింది ఈవీఎంలపైనేనా? ప్రజల దృష్టిలో దోషిగా మిగిలేది ఎన్నికల కమిషనే కావడం గమనార్హం. అందుకే ఈసీ ఈవీఎంలపై దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉంటుంది. లేకపోతే ప్రతి ఎన్నకకూ ఈవీఎం ఒక బూచిగా మారుతూనే ఉంటుంది.

# క్యాడర్‌లో కదలిక కోసం జగన్

**విజయవాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీ మారిపోతున్న నేతలు ఉన్న నియోజవవర్గాల నుంచి క్యాడర్ ను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. అలాగే జిల్లాలకు పార్టీ అధ్యక్షుల్ని కూడా నియమిస్తున్నారు. వీలైనంత వరకూ సీనియర్ నేతల్ని నియమిస్తున్నారు. అందర్నీ యాక్టివ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జనవరిలో నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. ఈ లోపు పార్టీ కార్యకర్తలకు, క్యాడర్ కు నమ్మకం కలిగించేందుకు గుడ్ బుక్ ప్రస్తావన తీసుకు వచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారందర్నీ గుర్తుంచుకుంటామని గుడ్ బుక్‌లో పేర్లు రాసుకుని అధికారంలోకి రాగానే మేలు చేస్తామని అంటున్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై భయపడకుండా పోరాడాలని పిలుపుస్తున్నారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత క్యాడర్ చాలా వరకూ సైలెంట్ అయిపోయింది. స్థానిక సంస్థల్లో ఉన్న క్యాడర్ పార్టీ మారిపోతోంది. పదవులు లేని వాళ్లు సైలెంట్ అయిపోతున్నారు. దీనికి కారణం టీడీపీని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేధించడం వల్లేనని ఇప్పుడు వారు కూడా అదేబాటలో వెళ్తే తాము తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎక్కువ మంది ఆందోళన చెందుతున్నారు. వీరందరికీ ధైర్యం ఇచ్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే లాయర్లను అందుబాటులో పెట్టారు. ఏవైనా కేసులు అయితే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు ఇప్పటికే సైలెంట్ అయ్యారు. చాలా మందిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జగన్ అందరికీ భరోసా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆయన వెంట ఉంటూ . పదేళ్ల పాటు ఆయనతో పాటు కలిసి నడిచిన వారిని అధికారంలోకి వచ్చాక జగన్ పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సోషల్ మీడియా కోసం పని చేసిన వారినీ పట్టించుకోలేదని చివరికి పెయిడ్ సోషల్ మీడియా పై ఆధారపడాల్సి వచ్చిందన్న అసంతృప్తి క్యాడర్ లో ఉంది. ఇక ద్వితీయ శ్రేణి నేతలు తమను జగన్ పూర్తిగా రోడ్డున పడేశారని అనుకున్నారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ తీసుకు రావడం వల్ల పాలనలో పార్టీ క్యాడర్ కు పని లేకుండా పోయిది. జగన్ కూడా వాలంటర్లకే ప్రాధాన్యం ఇచ్చారు. వారినే లీడర్లను చేస్తామని కూడా ప్రకటించారు. ఈ పరిణామాలతో గత ఎన్నికల్లో క్యాడర్ కూడా వైసీపీకి గట్టిగా పని చేయలేదన్న వాదన ఉంది. ఆ అసంతృప్తిని జగన్ గమనించారని అందుకే గుడ్ బుక్ అని చెబుతున్నారు. జగన్ బయటకు రాకుండా పార్టీ క్యాడర్ ను మాత్రమే తెరపైకి వచ్చేలా చేయడానికి ప్రయత్నిస్తే ఆ వ్యూహం ఫెయిల్ అవుతుందని జగన్ నాయకడిగా ముందుండి నడిపిస్తేనే ప్రయోజనం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. అందుకే జగన్మోనహన్ రెడ్డి జనవరి నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటనలకు రెడీ అవుతున్నారని చెబుతున్నారు. వైసీపీ హయాంలో నారా లోకేష్, చంద్రబాబు పర్యటనల సమయంలో ఉద్రిక్త పరస్థితులు ఏర్పడేవి. జగన్ పర్యటనలో అలాంటివి ఏర్పడినా జగన్ ముందుకు వెళ్తే.. ప్రభుత్వాన్ని ఎదిరించవచ్చని.. గొడవలు జరుగుతాయని అనుకుని ఆగిపోతే క్యాడర్ లో ధైర్యం రాదని చెబుతున్నారు. మొత్తంగా జగన్ పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేసేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని అనుకోవచ్చు.

## రోజా కంటే శ్యామలే బెటరా....

**తిరుపతి :** మాజీ మంత్రి రోజా సెల్వమణి వైసీపీ నేతల్లో ప్రస్తుతం అంతో ఇంతో యాక్టివ్‌గా ఉన్న నేతల్లో ఒకరు ? పార్టీ ఓటమి తర్వాత బూతు మంత్రులు అనింపిచున్న వారంతా తెరమరుగైపోయినా? రోజా మాత్రం అప్పుడప్పుడు మీడియాలో ఫోకస్ అవుతున్నారు ? అయితే రికార్డెడ్ వీడియోస్ రిలీజ్ చేస్తూ, ట్వీట్లకే పరిమితమవుతున్నారు .. దాంతో అసలు ఆమె ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుపట్టకుండా తయారైంది? ఒకవైపు యాంకర్ శ్యామల వంటి వారు వైసీపీ అధికార ప్రతినిధి హోదాలో మీడియా ముందుకొస్తున్నా? రోజా మీడియాకు ముఖం చాటేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోని పుంగనూరులో బాలిక అదృశ్యమై హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ ఘటనపై తక్షణమే స్పందించిన ప్రభుత్వం హత్యకు కారణాలు గుర్తించి.. నిందితులను అరెస్ట్ చేయడంలో సక్సెస్ అయింది. ఆ బాలికను ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య చేశారని పోలీసులు ప్రకటించినా.. వైసీపీ నేతలు మాత్రం బాలికపై అత్యాచారం జరిగిందని రాద్ధాంతం చేశారు. కక్షపూరితంగా జరిగిన ఆ హత్యకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశారు.ఈ ఘటనపై మాజీ మంత్రి రోజా.. ప్రీ రికార్డెడ్ వీడియో రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాల్లో చిన్నారులకు రక్షణ లేకుండా పోతుందని.. ఆడపిల్లలను స్కూళ్లకు పంపించాలంటే తెగ భయమేస్తుందని తెగ ఆవేదన వ్యక్తం చేశారు. సీన్ కట్ చేస్తే పుంగనూరు బాలిక హత్యపై అంత రాద్ధాంతం చేసిన వైసీపీ యూటర్న్ తీసుకుంది? బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి వైసీపీ అధ్యక్షుడు జగన్ వస్తున్నారని ప్రకటించిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరుసటి రోజే జగన్ టూర్ రద్దైందని ప్రకటించారు. ప్రభుత్వం ఆ ఘటనపై సకాలంలో స్పందించిందని, అందుకే జగన్ పర్యటన రద్దు చేసుకున్నారని వివరణ ఇచ్చారు.పెద్దిరెడ్డి అంత క్లారిటీ ఇచ్చినప్పటికీ రోజా తిరిగి ఆ ఘటనపై స్పందించలేదు. ఇంతలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం ఘటన వెలుగు చూసింది. బాలిక అపస్మారక స్థితికి చేరుకోవడంతో నిందితులు ఆమెను తిరిగి ఆటోలో ఎక్కిస్తుండగా, స్థానికులు పట్టుకుని వారిని పోలీసులకు అప్పగించారు. బాలిక బంధువు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదులోకి తీసుకున్నారు. దానిపై రోజా ట్విట్టర్లో స్పందించారు.'డిప్యూటీ సీఎం సొంత ఇలాఖాలోనే ఓ మైనర్ బాలికపై దారుణం జరిగితే చర్యలు లేవు" అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు రోజా. అంతకు ముందు వరదల సమయంలో కూడా రోజా ప్రభుత్వ సహాయక చర్యలపై అవగాహన లేకుండా విచిత్రమైన వ్యాఖ్యలు చేశారు. సీఎం సహా మంత్రులు వరద నీటిలో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తుంటే. ప్రభుత్వ పెద్దలపై అనుచిత వ్యాఖ్యలు చేసి విమర్శలు మూట గట్టుకున్నారు.తర్వాత తిరుమల లడ్డూ వివాదంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడి విమర్శలు మూట గట్టుకున్నారు స్పాట్ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రోజా నోటి దూకుడు ఏ స్థాయిలో ఉండేదో అందరికీ తెలిసిందే. ఆ నోటి దూకుడు పార్టీకి తీవ్ర నష్టం చేసిందని వైసీపీ నేతలే అంటున్నారు. అందుకే ఆమెకు జగన్ అధికార ప్రతినిధి హోదా కూడా ఇవ్వలేదని, అందుకే ఆమె ఉనికి కోసం రికార్డెడ్ వీడియోలు రిలీజ్ చేస్తూ.. ఎక్స్ వేదికగా రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రోజా కంటే రాజకీయాల్లో జూనియర్లు, అసలు రోజాకు ఏ రకంగా సమఉజ్జీ కాని యాంకర్ శ్యామల వంటి వారి వైసీపీలో అధికార ప్రతినిధి హోదా దక్కింది. శ్యామల రాజకీయంగా ఉనికి చాటుకోవడానికి ప్రెస్ మీట్లు పెడుతూ హడావుడి చేయాలని చూస్తున్నారు.

## ప్రైవేట్‌కు రుషికొండ ప్యాలెస్

**విశాఖపట్టణం :** జిల్ జిగేల్‌మంటూ శ్వేతవర్ణంతో మెరిసిపోతున్న భవంతులు.. పెద్ద పెద్ద ప్రవేశ ద్వారాలు.. విశాలమైన బెడ్రూమ్స్, అందుకు ఏ మాత్రం తీసిపోని స్నానాల గదులు, అత్యంత ఖరీదైన మంచాలు, పరుపులు, బాత్ టబ్‌లు, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియర్లతో మెరిసిపోయే ఆ వైభోగాన్ని కళ్లారా చూడాల్సిందే తప్ప వర్ణించలేం.ప్రభుత్వ ఖర్చులతోనే నిర్మించిన ఆ కట్టడం ఓ రాజభవనం. ఏ వైట్‌హౌస్ లోపలికో, బకింగ్‌హాం ప్యాలెస్‌లోకో అడుగుపెట్టిన ఫీలింగ్ కలుగుతుంది. అవే రుషికొండ సౌధం. గత వైసీపీ హయాంలో భీమిలి బీచ్ రోడ్డులో సముద్రాన్ని ఆనుకుని రుషికొండపై కట్టిన భవంతుల చుట్టూ ఇప్పటికీ వివాదం కొనసాగుతోంది.రూ.500 కోట్లతో అత్యంత విలాసవంతంగా నిర్మించిన ఆ భవనాల్ని ఇప్పుడేం చేస్తారన్న చర్చ మొదలైంది. రాష్ట్రపతి, ప్రధానితో పాటు ప్రముఖులు వచ్చినప్పుడు అతిథి గృహాలుగా వాడేందుకు కట్టామని వైసీపీ నేతలు చెప్తున్నారు. అయితే అంత వివాదం అయినా అప్పుడు ఎందుకు ఈ విషయాన్ని చెప్పలేదని టీడీపీ ప్రశ్నిస్తోంది.వైఎస్ జగన్ ఉండటం కోసమే రుషికొండ ప్యాలెస్‌ను కట్టారని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు రుషికొండ భవనాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై కూటమి సర్కార్ తర్జనభర్జన పడుతోంది. ప్రభుత్వ అవసరాలకే వాడుకుందామా లేక ప్రైవేటుకు ఇద్దామా అనేదానిపై ఇంటర్నల్‌గా చర్చలు జరుపుతోంది పర్యాటకశాఖపై సీఎం చంద్రబాబు పలుసార్లు రివ్యూలు చేసినా ఈ అంశం ప్రస్తావనకు రాలేదు. మంత్రులు దుర్గేశ్, లోకేశ్ విశాఖలో పర్యటించినా రుషికొండ భవనాన్ని సందర్శించలేదు. పర్యాటక శాఖ మంత్రి అయితే అది మ్యూజియంగా తప్ప దేనికి పనికిరాదంటున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్తున్నారు.అయితే ఇప్పటికే ఖాళీగా ఉన్న ఈ భవనాల నిర్వహణకు ప్రతి నెలా లక్షల్లో ఖర్చవుతోంది. నిర్వహణ సామర్థ్యం, నైపుణ్యం ఉన్న సిబ్బంది లేరు. వీటిని రిసార్టులుగా మార్చాలన్నా అక్కడి నిర్మాణాలు అందుకు తగ్గట్లు లేవు. దీంతో వచ్చే ఆదాయం కన్నా నిర్వహణ భారం ఎక్కువవుతుందని భావిస్తున్నారు. అందుకే రుషికొండ భవనాలను ఏం చేయాలనే దానిపై ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోందిరుషికొండపై 9.88 ఎకరాల్లో 7 భవనాలు నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలతో కట్టిన ఈ భవనాల నిర్వహణకే ప్రతిరోజు లక్ష వరకు ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ నిపుణుల అంచనా వేస్తున్నారు. ఈ భవనాలను పూర్తిస్థాయిలో వాడటం మొదలుపెడితే 100 మంది వరకు సిబ్బంది అవసరమని చెప్తున్నారు. మరో 50 మంది షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుందని.. ఇప్పటికే కొన్ని వస్తువులు పాడైనట్లు చెబుతున్నారు.ఇక రుషికొండ భవనాలకు విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఐదు నెలల్లో ప్రతి నెలా సగటున 6 లక్షలపైనే బిల్లు వచ్చింది. ఇప్పటివరకు 85 లక్షల విద్యుత్ బిల్లు బకాయి ఉంది. ఖాళీగా ఉన్న భవనాలకే ప్రతినెలా 40 వేల నుంచి 60 వేల యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. అదే వినియోగంలోకి వస్తే ఇది రెండింతలు అవుతుందని అంచనా.భవనాల దగ్గర 10వేల 4 చదరపు మీటర్లలో 58 రకాల మొక్కలు నాటారు. వీటిలో చాలావరకు విదేశాల నుంచి తెచ్చినవే. వాటి నిర్వహణ సరిగ్గా లేక చాలా మొక్కలు ఎండిపోయాయి. అయితే విలువైన ప్రభుత్వ ఆస్తిని నిరుపయోగంగా ఉంచడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

-మొదటిపేజీ తరువాయి

ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు మరింత ఉపసంహరించుకోవడానికి పరిస్థితులు మారుతున్నాయని తెలిపింది. ఆ తర్వాత రెండు రోజుల్లో దేశంలోని మిగిలిన ప్రాంతాల నుంచి ఉపసంహరించుకునే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి రుతుపవనాలు తిరోగమన సమయంలో దక్షిణ భారత దేశ ద్వీపకల్ప మీదుగా తూర్పు, ఈశాన్య గాలులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ద్వీపకల్ప భారతదేశ, దక్షిణ, దాన్ని ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతం, ఆగ్నేయ ద్వీపకల్ప ప్రాంతంలో ఈశాన్య రుతుపవనాల వర్షపాత కార్యకలాపాలు ప్రారంభమవుతాయని పేర్కొంది. నైరుతి బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో సుమద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఇది విస్తరించి ఉందని పేర్కొంది. ఇది సోమవారం నాటికి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని హెచ్చరించింది. మరో 48 గంటల్లో ఇది మరింత బలపడే సూచనలు ఉన్నాయని చెప్పింది. దీని ప్రభావంతో 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఇవాళ, రేపు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

**నెల్లూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఆనంద్ దీనిపై స్పందించారు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. 0861-2331261, 7995576699, 1077 నెంబర్ల ద్వారా కంట్రోల్ రూమ్ ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని డివిజన్లు, మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు వివరించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. భారీ వర్షాలతో వరదలు వచ్చే అవకాశం ఉన్నందున... రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పెన్నా నది గట్లను పరిశీలించాలని ఆదేశించారు. తీరప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

## సర్కారుకు భారీ ఆధాయం

-మొదటిపేజీ తరువాయి

చేశారు. అనంతపురం జిల్లాలో 12 దుకాణాలకు అతి తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో వీటిని పునఃపరిశీలించాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.
ఈసారి విదేశాల నుంచీ ఆన్‌లైన్‌లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు పెద్దఎత్తున వచ్చాయి. అయితే టెండర్ల దాఖలులో భారీఎత్తున ఏర్పడిన మద్యం సిండికేట్లు.. మొదట్లో దరఖాస్తులు పెద్దగా పడకుండా ప్రయత్నాలు చేశారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇవ్వడంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ స్థాయిలో మద్యం దుకాణాల కోసం అప్లికేషన్లు రావడం ఇదే తొలిసారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెప్తున్నారు. అక్టోబర్ 14న మద్యం దుకాణాల కేటాయింపు కోసం ఎక్సైజ్ అధికారులు లాటరీ నిర్వహిస్తారు. అందులో మద్యం షాపులు వచ్చిన వారికి ఈనెల 15న దుకాణాలు అందజేస్తారు. దీంతో ఈనెల 16నుంచి నూతన మద్యం విధానం ఏపీలో అమల్లోకి వస్తుంది. అన్ని రకాల బ్రాండ్లకు చెందిన చీప్ లిక్కర్‌ను రూ.99కే అందివ్వనున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇప్పటికే తెలిపింది. అలాగే దేశంలో తయారైన విదేశీ మద్యం బాటిళ్లు ఎమ్మార్పీ ధరను చిల్లర లేకుండా సర్దుబాటు చేసేలా అదనపు ప్రివిలేజ్ ఫీజు విధించనున్నారు.

## కనకదుర్గ దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించాం

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఈ ఏడాది ఇప్పటికే శ్రీవారి మూలవిరాట్‌ను ఆరు లక్షల మంది దర్శించుకున్నారని, 15 లక్షల మంది భక్తులు వాహన సేవలో పాల్గొన్నారని, 26 లక్షల మంది భక్తులు ఈసారి బ్రహ్మోత్సవాలకు వచ్చారని తెలిపారు. ఈ సంఖ్య గతేడాది 16 లక్షల మంది మాత్రమే భక్తులు వచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వెదికగా వ్యాఖ్యానించారు. కాగా దసరా శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం ఉదయం ఈ ఉత్సవాల ముగింపులో భాగంగా దేవాలయ ప్రాంగణంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామారావు, దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారి రామచంద్ర మోహన్ పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా ఈ పూర్ణాహుతి కార్యక్రమం ముగిసింది. మరోవైపు దసరా నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు శనివారం అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. దీంతో దేవాలయంలోకి వెళ్లే అన్ని క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. ఇంకోవైపు దుర్గమ్మ మాల ధారణతో వచ్చిన భవానీలు సైతం భారీ సంఖ్యలో ఇంద్రకీలాద్రికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి..

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అనంతపురంలో రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంతిని నిర్వహిస్తారు. ప్రభుత్వం తరఫున ముఖ్య అతిథిగా మంత్రి సవిత పాల్గొంటారు. కాగా యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీల్లో మొదటి హామీ చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యంలో (సెప్టెంబర్ 20న) కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. సెంటర్‌ను పరిశీలించిన లోకేష్.. రోగులతో మాట్లాడారు. అలాగే 30 పడకల ఆస్పత్రిని, ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని ఆయన అన్నారు. యువగళాన్ని అడ్డుకునేందుకు గత ప్రభుత్వం యత్నించిందని, కుట్రను ఛేదించుకుంటూ యువగళం యాత్ర సాగిందని లోకేశ్ వ్యాఖ్యానించారు. సామాజిక పెన్షన్లను ఒకేసారి రూ.4 వేలకు పెంచామని, రాష్ట్రానికి పెట్టుబడులతో పాటు పరిశ్రమలను తీసుకొస్తున్నామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సెంటర్లను ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నామన్నారు. దీంతో లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.వైసీపీ అధికారంలోకి వస్తే దశల వారీగా సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని జగన్ అన్నారని, అది అమలు చేయకపోగా.. రాజారెడ్డి రాజ్యాంగం తీసుకొచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని మంత్రి లోకేష్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై దొంగ కేసులు పెట్టారని, జైల్లో పెట్టించారని విమర్శించారు. తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా 23 కేసులు పెట్టారని, ఫేక్ జగన్ చెప్పేవన్నీ అబద్ధాలేనని దుయ్యబట్టారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను రద్దు చేశారని, అడుగడుగునా జగన్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. తిరుమల లడ్డూలో కూడా నాణ్యత లేకుండా చేశారని లోకేష్ మండిపడ్డారు.

## కొత్త సిలబస్ తోనే టెన్త్ పరీక్షలు

**గుంటూరు :** రాష్ట్రంలో గత మూడేళ్ల విద్యార్థులకు పాత సిలబస్‌తోనే పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వెబ్‌సైట్‌లో ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు, మార్కుల వెయిటేజీ వంటి అప్‌లోడ్ చేశారు.పదో తరగతి 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు పాత సిలబస్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. ఆ మూడు సంవత్సరాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఈ ఏడాది ఫెయిల్ అయిన సబ్జెక్టులు రాయలనుకుంటే వారు పాత సిలబస్ ప్రకారమే రాయడానికి అవకాశం ఉంది. ప్రైవేట్, రీ ఎన్‌రోల్ చేసుకున్న విద్యార్థులు, ఆయా సంవత్సరాల్లో ఏ సిలబస్ ప్రకారం అయితే పరీక్షలు రాశారో, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో కూడా వారికి పాత సిలబస్ వర్తిస్తుంది.ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25) పదో తరగతి విద్యార్థులకు మాత్రం మారిన కొత్త సిలబస్ ప్రకారం పబ్లిక్ పరీక్షలు ఉంటాయి. అందుకు సంబంధించిన ప్రశ్నా

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# టీడీపీలో కష్టపడి పని చేసినవారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది

## కష్టపడి పని చేస్తే పదవులు వెతుక్కుంటూ వస్తాయనేందుకు దామచర్ల సత్య ఉదాహరణ
## మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి
## కొండపిలో అట్టహాసంగా దామచర్ల సత్య అభినందన సభ



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, అక్టోబర్ 13)** తెలుగుదేశం పార్టీలో నిబద్ధతతో కష్టపడి పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయనే దానికి దామచర్ల సత్య ఒక ఉదాహరణ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం కొండపి సీతారామ కల్యాణ మండపంలో ఏపీ మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యకు అభినందన సభ నిర్వహించారు. ముందుగా కొండపి మెయిన్ సెంటర్ నుంచి కళ్యాణ మండపం వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో నిబద్ధతతో కష్టపడి పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయనే దానికి దామచర్ల సత్య ఒక ఉదాహరణ అని అన్నారు. సత్య ఏ బాధ్యతలు అప్పగించినా సమర్ధవంతంగా నిర్వర్తి ఇస్తాడని అన్నారు. చిన్న వయసులోనే చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. సత్య కార్యకర్త లకు ఏ కష్టం రాకుండా కంటికి రెప్పలా కాచుకునేవాడన్నారు.

ఆయన కార్యకర్తలను ఆదరించే విధానం పార్టీకి చేసిన సేవను గుర్తించి చంద్రబాబు నాయుడు మారి టైం బోర్డు చైర్మన్ గా అవకాశం కల్పించి సత్కరించారన్నారు. ఏ నాయకుడికైనా పదవులు అలంకారం మాత్రమేనని ప్రజలకు (తరువాయి 4లో...)



# నేత్రపర్వంగా శ్రీ హరిహర క్షేత్రంలో దసరా పార్వేట ఉత్సవం

## తొమ్మిది రోజులు వివిధరూపాలతో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు
## చివరిరోజు ఉదయం మహిషాసుర మర్ధని, శ్రీ రాజరాజేశ్వరి దేవి,
## శ్రీ కన్యకాపరమేశ్వరిగా భక్తులకు అభయ ప్రధానం
## శమి వృక్ష, పూజ, కుంకుమ పూజలు చేసిన
## శిద్దా రాఘవరావు దంపతులు, పాండురంగారావు దంపతులు
## ధనుర్బానం ఎక్కుపెట్టిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



4

# ఏడాదిగా నిలిచిన వికలాంగురాలి పెన్షన్ పట్టించుకోని అధికారగణం



**(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 13)** అర్హత ఉన్నా ఏడాదిగా పింఛన్ నిలిపివేయదంతో కుటుంబ పోషణ ప్రశ్నార్ధకంగా మారిందని ఆవేదన చెందుతున్న వికలాంగురాలు సయ్యద్ భానుబి బేగం. ఆమె పుట్టుకతో వికలాంగురాలు. ఏడాది నుండి వికలాంగుల పెన్షన్ నిలిపివేశారు. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భవతి. భర్త తోడు లేనిదే ఏ పని చేయలేని దుస్థితి. ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉండటంతో ఇరుగుపొరుగువారు ఎంతో కొంత సహాయం చేస్తున్నారు. అధికారులు జాలి తలచి తనకు తిరిగి పెన్షన్ తనకు తిరిగి పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కన్నీటితో వేడుకుంటుంది. ఆమె ప్రస్తుతం కంభం పట్టణంలోని డాల్ సాహెబ్ వీధిలోని ఒక ఇంట్లో అద్దెకు నివసిస్తుంది. ఆమె భర్త టీ మాస్టర్‌గా పని చేసేవాడు కాని, ప్రస్తుతం ఆమె గర్భవతి కావడంతో ఆమెకు తోడుగా ఉండవలసి రావడంతో పని మానేసి ఆమెకు తోడుగా ఉంటున్నాడు. ఆమె ప్రస్తుత ఆర్ధిక పరిస్థితి బాగలేనందుకు ఆమెకు ఆర్ధిక సహాయం చేయదలచిన వారు ఫోన్ పే, గూగుల్ పే నెం. 9278747480 కు సహాయం అందించాలన్నారు.

# విజయదశమి సందర్భంగా అన్నసంతర్పణ చేసిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)** విజయదశమి సందర్భంగా లాయర్ పేట సాయిబాబా ఆలయంలో ఆదివారం రాష్ట్ర మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు దంపతులు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మాజీమంత్రి శిద్దారాఘవ రావు దంపతులు ఆద్వర్యంలో జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


4





# మబ్బుల్లో కనువిందు చేసిన ఇంద్రధనస్సు

ఆదివారం సాయంత్రం ఒంగోలు నగరంలోని నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పడిన ఇంద్ర ధనస్సును షణ్ముఖ వెలుగు స్టాఫ్ ఫోటోగ్రాఫర్ ఉబ్బా అశోక్ తన కెమెరాలో బంధించాడు ఇలా......





(ఉబ్బా అశోక్, స్టాఫ్ ఫోటోగ్రాఫర్, ఒంగోలు)

# విజయదశమి సందర్భంగా అన్నసంతర్పణ చేసిన మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు దంపతులు





ప్రతి ఏటా యధాతథంగా విజయదశమి నాడు మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా శిద్దా రాఘవరావు దంపతులు బాబా చిత్ర పటానికి పూజలు నిర్వహించి స్వహస్తాలతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. షిర్డీ సాయ బాబా ఆలయ కమిటీ సభ్యులు శిద్దా రాఘవరావు దంపతులకు స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, పుష్పమాలతో గౌరవించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వదాలు అందచేశారు. ఈ సంధర్భంగా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ సాయి బాబా ఆశీస్సులతో గత కొన్ని సంవత్సరాలుగా విజయ దశమి నాడు అన్న సంతర్పణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశం మాకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో షిర్డీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు మల్లాది వెంకట సుబ్బలక్ష్మమ్మ, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ప్రసాదరావు, గంజాం విజయ శివకుమార్, మెడా జయరాజ్, వాసు, సాయి రాజ్, సాయిబాబా, చంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా శ్రీ హరిహర క్షేత్రంలో దసరా పార్వేట ఉత్సవం




**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 13)**

దసరా శ్రీ దేవి నవరాత్రులు సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో సంబరాలు అంబరాన్నంటాయి. మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు కన్నులపండువగా సాగాయి. శనివారం ఉదయం అమ్మవారు మహిషాసురమర్దని, సాయంత్రం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ వాసవి అమ్మవారుగా దర్శనం ఇచ్చారు. క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అర్చక స్వాములు విశేష పూజలు, అలంకరణలు, పంచామృత సుఘంద ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. దసరా నవరాత్రులు సందర్భంగా విజయదశమి పునస్కరించుకొని శిద్దా రాఘవరావు దంపతులు క్షేత్రంలో వేంచేసి ఉన్న దేవతా మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. శిద్దా రాఘవరావు దంపతులు అమ్మవారికి, స్వామి వార్లకు సారె సమర్పించారు. క్షేత్రంలో ఉన్న ఉత్సవ మూర్తులకు శిద్దా రాఘవరావు దంపతుకు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా కుటుంబ సభ్యులు విశేష పూజలు, గణపతి పూజ, క్షేత్ర ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం శమి వృక్ష పూజలు నిర్వహించారు. శమీ శమయతే పాపం శమీ శత్రు వినాశనీ అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శనం అనే శ్లోకాన్ని చదువుతూ శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురగారావు దంపతులు జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇలా చేయటం వల్ల అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని, శని దోషాలు పోతాయని భక్తుల నమ్మకం అని, విజయదశమి సందర్భంగా శమి వృక్ష చేస్తే అపరాజితాదేవి అనుగ్రహం కలుగుతుందని వేద పండితులు భక్తులకు తెలిపారు. విజయదశమి సందర్భంగా ఆదివారం సాయంత్రం శ్రీ హరిహర క్షేత్రంలో దసరా ఉత్సవాలు, పార్వేట వేడుకలు నిర్వహించారు. మహిళా భక్తుల భక్తీ పాటలు, సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణంతో శ్రీ హరిహర క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీమతి శిద్దా లక్ష్మీ పద్మావతి విజయదశమి సందర్భంగా సువాసినులకు పసుపు కుంకుమ, పూలు, రవికెలు, చీరలు, అందచేసారు. వివిధ ప్రాంతాల నుండి శ్రీ హరిహర క్షేత్రం విచ్చేసిన రామకృష్ణ శర్మ ఋత్వికులు చతుర్వేద పారాయణం వేద మంత్రాల ఘోషతో శ్రీ హరిహర క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం ఋత్వికులు శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా పాండురంగారావు దంపతులకు, శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా సాయి బాబు, శిద్దా సురేష్ దంపతులకు వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ, హరి కుమారాచార్యులు, హరిక్రిష్ణశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. శిద్దా వెంకటేశ్వర్లు శ్రీమతి వేంకటసుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు వాహన సౌకర్యం, అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా వారి కుటుంబ సభ్యులు, చీమకుర్తి ఆర్యవైశ్య మహిళలు కొణిజేటి సువర్ణ, చాట్ల సువర్చల, కూరపాటి ధనలక్ష్మి, చలువాది మాధవి, ఏ అరుణ, గాధంశెట్టి లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.




## నేడు తిరుపతి జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్



**(షణ్ముఖ వెలుగు, తిరుపతి, అక్టోబర్ 13)**

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని భారత వాతావరణశాఖ వెల్లడించిన మేరకు నైరుతి బంగాళాఖాతంలో సోమవారానికి అల్పపీడనం ఏర్పడనుందనే హెచ్చరికలు, రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ వారి హెచ్చరికల నేపథ్యంలో అక్టోబర్ 14 నుండి 17 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ రద్దు చేస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వ్యయ ప్రయాసలకోర్చి రావద్దని, అలాగే డివిజన్, మండల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు కూడా రద్దు చేస్తున్నట్లుగా తెలుపుతూ, జిల్లాకు భారీవర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీకి పితృవియోగం



**(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 13)**

నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ తండ్రి షేక్ చాన్ బాషా ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు రఫీ నివాసానికి చేరుకుని చాన్ భాషకు నివాళు లర్పించారు. అనంతరం రఫీ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## అంజని శ్రీకరం బ్రోచర్ ఆవిష్కరణ




**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)**

పెద్ద చెరుకూరు, సిరి గార్డెన్స్ బ్యాక్ సైడ్ అంజని శ్రీకరం బ్రోచర్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. అంజని శ్రీకరం బ్రోచర్ ఆవిష్కరణ ముఖ్యఅతిథిగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి హాజరయ్యారు. అంజని శ్రీకారం ఇన్వెట్స్ బై శ్రియ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ సందర్భంగా ఆగస్టస్ మాట్లాడుతూ అంజని శ్రీకరం లేఅవుట్ నెల్లూరుకు అతి తక్కువ దూరంలో, కస్టమర్స్ అతి తక్కువ ధరలో కొనే విధంగా అంజని శ్రీకరం లేఅవుట్ ఉందని తెలిపారు. ఈ లేఅవుట్ ను ఎంతో అందంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రియ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో కష్టపడి పని చేసినవారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది

చేసిన సేవే చరిత్రలో మిగిలిపోతుందన్నారు. చంద్రబాబు నాయుడుకు సత్య మీద పూర్తి నమ్మకం ఉందన్నారు. సత్య భవిష్యత్ లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నటు మంత్రి తెలిపారు. గత ఏళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని అన్నారు. ఎస్సి కార్పొరేషన్ ని నిర్వీర్యం చేసారని, 5 ఏళ్లలో ఒక్కరికీ కూడా ఒక్క రుణం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ 100 రోజుల పాలనలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమానికి కొండపి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## దసరాకు యడవల్లిలో జమ్మి చెట్టుకు ఘనమైన పూజలు



**(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, అక్టోబర్ 13)**

విజయదశమి పండుగను దేశవ్యాప్తంగా హిందువులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. మండలంలోని యడవల్లి గ్రామంలో విజయదశమి పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు శ్రీ సీతరాముల చంద్ర స్వాములవార్ల దేవాలయంలో శనివారం పూజారి శ్రీనివాసులు ప్రత్యేకంగా పసుపు, కుంకుమలతో పూజలు చేసి గ్రామంలో శ్రీ సీతారాముల చంద్ర స్వాముల వార్ల విగ్రహాలను గ్రామం నుండి ఊరేగింపు చేసుకొని జమ్మి చెట్టు వద్దకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకమైన జమ్మి చెట్టుకు పసుపు, కుంకుమ,ఆవ నూనెతో దీపం వెలిగించి ఘనమైన పూజ కార్యక్రమాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. జమ్మి చెట్టుకు ప్రత్యేకంగా పూజలు చేసి దసరా పండుగ రోజు పర్వదినాన బంధువులు స్నేహితులంతా ఒకచోట చేరి జమ్మి ఆకులను ఒకరికొకరు పంచుకొని జమ్మి చెట్టుకు మొక్కితే గ్రామంలో పచ్చని పంటలు పండాలని గ్రామ భక్తులు ఘనమైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యడవల్లి సర్పంచ్ యేర్వ భూనేశ్వరి భర్త మల్లికార్జున్ రెడ్డి,మాజీ సర్పంచ్ యాక్కంటి పొలిరెడ్డి, గుండారెడ్డి శ్రీనివాసరెడ్డి, నల్లబోతుల బోడయ్య,మండ్ల మంతయ్య,చల్లా వెంకటస్వామి, గోగులపాటి వెంకటస్వామి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలులోని సౌత్, నార్త్, వెస్ట్, ఈస్ట్ బైపాస్‌లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టారు. ద్విచక్రవాహనదారులు, కార్లు నడిపేవారు హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని, డ్రైవ్ చేస్తూ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని ఎస్ఐ బాబురావు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించారు.

## మర్యాద పూర్వకంగా యారవ శ్రీనును కలిసిన పూసల కాలనీ వాసులు





**(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 13)**

స్థానిక పట్టణంలోని కాబోయే వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులను పట్టణానికి చెందిన పూసల కాలనీ వాసులు కలిసి ఆయనను శాలువాతో సత్కరించారు. పూసల కాలనీవాసులు ఆయనకు పలు సమస్యలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పూసల కాలనీ యువకులు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అత్యాధునిక వైద్య సేవలకు కేర్ ఆఫ్ అడ్రస్ ప్రైమ్ హాస్పిటల్

### నిష్ణాతులైన డాక్టర్ల టీమ్ నిరంతర పర్యవేక్షణ
### అందుబాటులో లేటెస్ట్ మెడికల్ ఎక్యూప్మెంట్
### విలువలతో కూడిన వైద్యం
### ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)**

ప్రైమ్ హాస్పిటల్ అందించే వైద్య చికిత్సలు, ఇక్కడి అత్యాధునిక వైద్య పరికరాలు చూస్తుంటే చిన్నారులకు అనారోగ్య సమస్యలు ఎదురై అత్యవసర పరిస్థితులలో చెన్నైకు పోవాల్సిన అవసరం రాదన్నారు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. నెల్లూరు నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న ప్రైమ్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వేమిరెడ్డి దంపతులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. చిన్న పిల్లలకు అందించే ట్రీట్మెంట్ గురించి ప్రైమ్ హాస్పిటల్ కు చెందిన మెడికల్ టీమ్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, టి వి నాగరాజు, కెవి అజిత్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి మాట్లాడుతూ చెన్నైలో దొరికే ట్రీట్‌మెంట్ ఇక నుంచి మనకు నెల్లూరులో అందుబాటులో ఉంటుందన్నారు. కిడ్స్ కు సంబంధించి క్రిటికల్ ట్రీట్మెంట్ కు అవసరమయ్యే జర్మనీకి చెందిన డ్రాగర్ బేబీ లాగ్ వెంటిలేటర్స్, జపాన్ దేశానికి చెందిన నిహాన్ కోడాన్ వంటి లేటెస్ట్ ఎక్యూప్మెంట్ ఏర్పాటు



చేసిన ప్రైమ్ హాస్పిటల్ నిర్వాహకులను ఆయన కొనియాడారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఆపరేషన్ థియేటర్ వున్న ప్రైమ్ హాస్పిటల్ చిన్న పిల్లల హాస్పిటల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదల పట్ల దయార్ద్ర హృదయంతో



స్పందించాలని ఎంపి నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో నవంబర్ 26న జరగనున్న మాలల మీటింగ్‌ను జయప్రదం చేయండి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

రాజ్యాంగ సవరణ జరగ కుండా వర్గీకరణ సాధ్యం కాదని మాలల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ భవన్ లో మాలల జేఏసీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదులు ఒకే కులం గా ఉన్నటువంటి ఎస్సీలను విభజించేందుకు ప్రయత్నం చేసేదాంట్లో భాగమే వర్గీకరణ అంశాలు ముందుకు తీసుకు రావడం జరిగిందని అన్నారు. ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఆరుగురు సభ్యులు వర్గీకరణకు అనుకూలంగా తీర్పిస్తే ఒక సభ్యులు వ్యతిరేకంగా ఉన్నారని అది ఏది కరెక్ట్ అని ఆయన అన్నారు. అశోక విజయదశమి శాంతియుత మార్గంలో విజయం సాధించారని మాలల జేఏసీ కూడా శాంతియుత మార్గంలో ప్రజా పోరాటాల ద్వారా మాత్రమే వర్గీకరణ అంశాన్ని వెనక కొట్టాలని వారు అన్నారు. అందులో భాగంగా నవంబర్ 26వ తేదీన రాజ్యాంగం ఆమోదించిన రోజున గుంటూరులో భారీ బహిరంగ సభ జరుగుతుందని పల్లెల నుండి పట్నానికి మాలలో మాల ఉద్యోగులు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు పండు అశోక్ కంచర్ల చిట్టిబాబు దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు, మంచా మల్లేశ్వరి, కొండలరావు, శ్రీరాములు,వెంకట్,గోపినాథ్,జనార్ధన్,జాలయ్య, మీడియా ఇంచార్జ్ శాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు జన్మదిన వేడుకలు





**(షణ్ముఖ వెలుగు, పామూరు, అక్టోబర్ 13)**

స్థానిక పామూరు పట్టణానికి చెందిన వార్డ్ మెంబర్ పిడుగు శ్రీనివాసులు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ యువతకు అన్నివేళలా ఏ విధమైన సహాయం సహకారాలు చేయడానికి నేను వెనకాడను అని ఆయన తెలిపారు. స్థానిక టిడిపి యువకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వాయునేని రాఘవ కటికం రవి జగన్నాథం గోపి అన్నబోయిన శేఖరు షేక్ మస్తాన్ ఉదయ్ కటికం హరీష్, టిడిపి నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాకు భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

### ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
### మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్ళారాదు
### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు
### జిల్లా కలెక్టర్ ఆనంద్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)**

అల్పపీడనం, తుఫాను ప్రభావం వల్ల రాబోయే 3 రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం మంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం వెబెక్స్ ద్వారా అధికారులతో సమావేశమైన కలెక్టర్, భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు,ఆదేశాలు ఇచ్చి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు, నాలుగు రోజులు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు ,తుఫాను వచ్చి నట్లయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధం గా ఉండాలని సూచించారు.

**కలెక్టరేట్ లో కంట్రోల్ రూం ఏర్పాటు**

నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో 0861-2331261, 7995576699-1077 నెంబర్లు నిరంతరం పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, మూడు షిఫ్టులలో సిబ్బందికి డ్యూటీలు వేసినట్లు కలెక్టర్ చెప్పారు. డివిజన్ మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని ఆర్డీవోలు, తహసీల్దార్ లకు కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ల రాదని, సముద్రంలో వేటకు వెళ్లి ఉంటే వెంటనే తిరిగి బయటకు రావాలని సూచించారు. వేటకు ఎవరు వెళ్ళారో ఆరా తీసి తిరిగి వచ్చే విదంగా మత్స్య శాఖ అధికారులు చర్యలు తీసు కోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పెన్నా నది గట్లను పరిశీలించాలని, పెన్నా నది గట్లు బలహీనంగా ఉన్నా, గుండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి గండ్లు పడకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా, మైక్ ప్రచారం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, భారీ వర్షాలు, తుఫాను సంభవిస్తే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, తీర ప్రాంతంలో పూరి గుడిసెలు ,తాటాకు ఇళ్లలో ఉండే ప్రజలు పక్కా భవనాల్లో,తుఫాన్ షెల్టర్లకు వెళ్లేలా అప్రమత్తంగా ఉంటూ అవగాహన కల్పించాలన్నారు. సోమశిల ప్రాజెక్టు నీటి మట్టాలను తెలుసుకుంటూ పెన్నా నదికి వరద వస్తే నదీ పరివాహక ప్రాంతంలో ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆత్మకూరు ఆర్డీఓకు సూచించారు. యజమానులతో మాట్లాడి బోట్లు, జెసిబిలు, సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వాటి తరలింపుకు వాహనాలను, మనుషులను సిద్ధం చేసుకోవాలన్నారు. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, పాలు, కూరగాయలు , వాహనాలు, డీజిల్ సిద్ధంగా ఉంచేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులలో ముందుగానే త్రాగు నీటినీ నింపుకోవాలన్నారు. అధికారులందరూ హెడ్ క్వార్టర్స్‌లోనే వుండాలని, జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రులలో అత్యవసర మందులు, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్అండ్‌బి, విద్యుత్, ఇరిగేషన్, రెవిన్యూ శాఖలతో పాటు ఇతర అధికార యంత్రాంగ మంతా అప్రమత్తంగా వుండాలన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ చెప్పారు. అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చెయ్యాలని, ఒక్క ప్రాణ నష్టంగాని, పశు నష్టం గాని జరగకుండా చూసేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ వెబెక్స్‌లో జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్‌డిఓలు, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# సాయిబాబాకు విప్లవ జోహార్లు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

మానవ హక్కుల కార్యకర్త, మేధావి, ప్రొఫెసర్ కామ్రేడ్ జి ఎన్ సాయిబాబా 2024 అక్టోబర్ 12వ తేదీ రాత్రి నిమ్స్ ఆసుపత్రిలో మరణించాడనే వార్త సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీని తీవ్ర దిగ్భ్రాంతి గురిచేసింది. ఆయన మరణం విప్లవానికి తీర్చలేని లోటు అన్నారు. అరెస్టులు, నిర్బంధం, జైలు శిక్షలు ఆయన ఆశయం ముందు తలవంచేలా చేసి పోరాట శక్తులకు ఎంతో స్ఫూర్తినీ ఇచ్చిన కామ్రేడ్ జీఎన్ సాయిబాబా మరణం విప్లవోద్యమానికి మర్చిపోలేనిదన్నారు. ఆయన జైల్లో అనేక రకాలైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేశాడు. సాయిబాబా ఆదివాసి ప్రజల పక్షపాతి. పీడిత ప్రజల గొంతుక. ఆదివాసి,దళిత తదితర పీడిత ప్రజల తరపున ఆయన అంతిమ శ్వాస వరకు పోరాడారు. గోకరకొండ నాగ సాయి బాబా (జియన్.సాయిబాబా) ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా,అమలాపురంలో పేద రైతు కుటుంబంలో జన్మించాడు. 5 సంవత్సరాల వయసులోనే పోలియో వచ్చి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. స్థానికంగా విద్యాభ్యాసం చేసిన తర్వాత అమలాపురంలోని శ్రీ కోనసీమ బాణోజి రామర్స్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేశాడు. హైదరాబాద్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ లో కూడా విద్యాభ్యాసం పూర్తి చేశాడు. తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఆనంద కళాశాలలో ఆంగ్ల విభాగంలో పనిచేశాడు 2013లో పిహెచ్డి



పూర్తి చేశాడు. అమలాపురంలో గ్రాడ్యుయేషన్ చేస్తున్న కాలంలోనే అతను విప్లవ రాజకీయాలతో పరిచయం ఏర్పడింది. ఆల్ ఇండియా పీపుల్స్ రెసిడెన్స్ ఫోరంలో చేరాడు. 1992లో హైదరాబాద్ విద్యాలయంలో చదివేటప్పుడు ఆ ఫోరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి అయ్యాడు. 95 నాటికి ఆ సంస్థ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. హైదరాబాదులో జరిగిన అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రదర్శనలో సభల్లో కామ్రేడ్ సాయిబాబా పాల్గొని ఎంతో మందిని చైతన్యపరిచాడు. అతనికి మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఆరోపణతో 2014 మే 9 మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేసి అనేక తప్పుడు కేసులు బనాయించారు. ఉపా కింద నిర్బంధించి చివరికి సాయిబాబాకి కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. అతను నాగపూర్ జిల్లా ఏకాంత (అండా సెల్)లో దాదాపుగా 3558 రోజులు దుర్భర జీవితాన్ని అనుభవించాడు. జైల్లో ఉండగా ఆయన అనేక జబ్బులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ప్రభుత్వం వైద్య సహాయాన్ని సక్రమంగా అందించలేదు.ఒకరు సహాయం చేస్తే తప్ప కదలలేని సాయిబాబా పట్ల ప్రభుత్వం అత్యంత క్రూరంగా దుర్మార్గంగా వ్యవహరించింది. ఎట్టకేలకు సాక్షాలు లేవనే పేరుతో సుప్రీంకోర్టు యావజీవ శిక్షను రద్దు చేయడంతో 2024 మార్చి 8న నాగపూర్ జైలు నుంచి ప్రొఫెసర్ సాయిబాబా విడుదలయ్యాడు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే నేరంగా పీడితే ప్రజల గొంతుకగా నిలబడటమే ధిక్కారంగా భావించి సాయిబాబా లాంటి మేధావుల్ని ప్రభుత్వం జైల్లో నిర్బంధించి రాజ్యాంగ హక్కుల్ని హరిస్తుంది. సాయిబాబా మరణం టెక్నికల్గా సహజ మరణమే కావచ్చు కానీ ఇది ప్రభుత్వం చేసిన హత్య అకారణంగా 10 సంవత్సరాలు జైల్లోని నిర్బంధించి ఆయనని శారీరకంగా మానసికంగా హింసించింది. సాయి బాబా ప్రదర్శించిన పట్టుదల పోరాటపటిమ అంకితభావం నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన స్వప్నించిన సమ సమాజం కోసం పోరాడాలని ఆయన ఆశయాలను సాధించి తీరుతామని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక, పలకరింపు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, అక్టోబర్ 13)**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల పూర్వ విద్యార్థులు సమావేశం సూళ్లూరుపేట పూర్వ విద్యార్థులు కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఇస్రో మాజీ సంచాలకులు డాక్టర్ నారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల నుంచి కొత్త కమిటీ ఏర్పాటు చేసుకొని పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు కల్పన కోసం కొత్త కమిటీ ద్వారా పని చేయాలని వారు తెలిపారు.

ముఖ్య అతిథులుగా డాక్టర్ అనురాధ, తీరే వీరయ్య, రాంగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్, ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎల్ శ్రీనివాసులు ఇస్రో మాజీ ఉద్యోగి, ఆర్ఐఒ డాక్టర్ ఆదురు శ్రీనివాసులు, ఆర్ఎం ఉమహేశ్వర్, ఉస్మాన్ బాషా, ఆదినారాయణ రెడ్డి, శివకుమార్ రెడ్డి, సురేష్, వీర రాఘవులు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు అంశాలు చర్చించారు.

# అభివృద్ధి కార్యక్రమాల పై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, అక్టోబర్ 13)**

ప్రజా సమస్యల అభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పట్ల దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూసా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమంతునిపాడు మండల ఏర్పాటుచేసిన మండల కేంద్రం శాఖ మహాసభలో పాల్గొని వీరు ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎస్ వెలుగొండయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 100 రోజుల ప్రభుత్వ పాలనలో ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రభుత్వం ఆర్భాట ప్రచారం నిర్వహిస్తుందని, మంచి చెడులు తేల్చాల్సింది ప్రజల అన్న విషయాన్ని పాలకులు మర్చిపోరాదన్నారు. ప్రజలకు మంచి జరిగితే మంచి అంటారు ఇచ్చిన వాగ్దానాల అమలు చేయకుండా ఉంటే ఇది చెడ్డ ప్రభుత్వం అంటారు అన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. హామీలు అమలులో తమ చిత్తశుద్ధిని ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం కోసం లడ్డు పేరుతో మత విద్వేషాలను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు. అధికార యంత్రాంగం వాస్తవాలను న్యాయ విచారణ ద్వారా ప్రజలకు తెలియపరచి తప్పు చేసిన వారిని శిక్షించవచ్చన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పటికీ ఆ వైపున ప్రయత్నం కాకుండా ప్రచార ఆర్భాటాలకు ప్రాధాన్య తేవటం తగదన్నారు. మండల పార్టీ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తక్షణమే వెలుగొండ ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నిధులు కేటాయించి ప్రాజెక్టును ప్రాధాన్యత పరంగా పూర్తి చేసి పాలకులు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కనిగిరి నుండి ఖమ్మం రోడ్డు మురికి గుంతలుగా మారిందన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, మండల కేంద్రంలోని ఇళ్ల స్థలాలు పేదలకు సాగుభూమి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని, రోజు కూలి రూ.600కు తగ్గకుండా వేతనం ఇవ్వాలని, హాజీపురం చెరువుకు సబ్ ఛానల్ ఏర్పాటు చేసి దోమలేరు నీళ్లు చెరువుకు మళ్ళించడంతో పాటు ఆక్రమణల నుండి చెరువులు కాపాడాలన్నారు. సాగుదారులకు నీటి వసతి చర్యలు తీసుకోవాలని, మండల కేంద్రంలోని పీహెచ్సీ సెంటర్‌ను 24 గంటలు సర్వీసుగా మార్చి ప్రజలందరికీ అందుబాటులో ప్రభుత్వ వైద్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని శాఖ మహాసభ తీర్మానం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కార్యదర్శులు కత్తి ఏబు, కేసీ రామయ్య, గురునాథం, రాములు, జక్కుల రమేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# కాపులు ఐకమత్యంతో ముందుకు కదలాలి





## బంధువులు, ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర కాపు నేత శాసనాల పిలుపు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, అక్టోబర్ 13)**

కాపులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఐక్యత లేకపోవడంతో అన్ని రంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నారని, అలా కాకుండా ఐక్యమత్యంతో ముందుకు కదలాలని రాష్ట్ర కాపు సంఘం నాయకులు, ప్రకాశం జిల్లా టిడిపి అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. జై వీరాంజనేయ స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వినుకొండ పట్టణంలో కాపు సంఘం బంధువుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మాజీ సర్పంచ్ యేలిసెట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనాల మాట్లాడుతూ ఉన్నత ఆలోచనలతో, సమిష్టి నిర్ణయాలతో, స్వయం సమృద్ధితో అన్ని రంగాలలో రాణిస్తూ సమాజంలో గౌరవప్రదంగా జీవించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంచి విజ్ఞానవంతులుగా ఉంటూ ఆర్థిక లేమితో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థిక సహకారాన్ని అందించి వారి ఉన్నత విద్యకు పాటుపడేందుకు ప్రతి ఒక్కరు శాయు శక్తుల కృషి చేయాలని ఆయన కోరారు. రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఆర్థిక సంబంధాలే కాకుండా మానవ సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు అప్పుడప్పుడు ఇలాంటి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పిల్లలకు విద్యారంగ ప్రాముఖ్యతను వివరిస్తూనే మరోవైపు బంధుత్వాలు, మిత్రులు, సమాజసేవ, అన్నిటికి మించి వ్యక్తిగత క్రమశిక్షణ, ఉన్నత విలువలు తదితర అంశాల పట్ల ఆలోచనలను పెంపొందించాలని ఆయన కోరారు. సేవా దృక్పథంతో అనేక మంచి కార్యక్రమాలను చేపడుతున్న జై ఆంజనేయస్వామి సేవా సంఘం పనితీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ కమిటీ సభ్యులను శాసనాల వీరబ్రహ్మం అభినందించారు. ఆత్మీయ సమ్మేళనం నిర్వాహకులు పాపారావు, యేలిశెట్టి నరసింహారావులు మాట్లాడుతూ తమ పూర్వీకుల యొక్క స్థితి గతులు, బందువుల ప్రాముఖ్యతను నేటి తరం వారికి వివరించి, వారిలో ఆత్మీయతను కలిగించేందుకే ఈ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. సభ అనంతరం 70 సంవత్సరాలు వయస్సు పైబడిన పెద్దలను నిర్వాహకులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాల్వ రామ మోహన్ రావు,మార్కాపురం పట్టణ మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు యేలిశెట్టి చలమయ్య, ఆదినారాయణ, శాసనాల సత్యనారాయణ, శాసనాల నాగ సైదులు తో పాటు వివిధ జిల్లాల నుండి సభ్యులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతుల ప్రధానం






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

ఒంగోలు మినీ స్టేడియంలో రెండవ రోజు శనివారం టేబుల్ టెన్నిస్ రెంకింగ్ టోర్నమెంట్ లో భాగంగా పురుషులు మరియు మహిళా విభాగల్లో అండర్ 17-19 సీనియర్ విభాగల్లో విజేతలకు బహుమతి ప్రధానం ముఖ్య అతిథులుగా విచ్చేసిన హైకోర్ట్ న్యాయవాది మన్నం సుదీర్ హాజరై విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాలనుండి వచ్చిన క్రీడా కారులలు ఆట పై మక్కువతో విజేతలుగా నిలిచిన వారిని ఇదే పట్టుదలతో దేశానికీ, రాష్ట్ర నికి ముఖ్యముగా మిమ్మల్ని ఇంత వరకు నడిపించి తీర్చిదిద్దిన తల్లిదండ్రులను గౌరవ స్థానంలో నిలపాలని ఆశపడుతున్నానన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. జనరల్ సెక్రటరీ యస్ విశ్వనాదరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో ఆటల్లో రాణించాలన్నారు.ఎడిటిటిఏ చైర్మన్ డాక్టర్ యస్ కిషోర్ కుమార్, ఎడిటిటిఏ ప్రసిడెంట్, ఏజె సొల్యూషన్స్ యండి ప్రియా, ఎడిటిటిఏ సెక్రటరీ రవి, రిఫరీలు, కోచ్‌లు యండి హాజీరా బేగం, జలిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రమణమ్మ, నరసమ్మకు సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

ఆరోగ్యం బాగలేక ఇబ్బందులు పడుతున్న కుంచాల రమణమ్మకు సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదివారం రూ.20 వేలు అందజేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుని ఆదర్శంగా తీసుకుని 24వ డివిజన్ క్లస్టర్ అధ్యక్షులు బండారు మదన్, డివిజన్ అధ్యక్షులు గుంటూరు రాంబాబు ఆధ్వర్యంలో 144 బూత్ ఇంచార్జి ఈనాదుల విజయ భాస్కరరావు, ఒడ్డుపాలెం సాయి, నేరెళ్ళ శ్రీను, కూటమి సభ్యులు ముందుకు వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతున్న వడ్డెపాలెంలోని కుంచాల రమణమ్మకి సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి నెల రూ.5,000ల పెన్షన్, 3 నెలలు ప్రొవిజన్స్ ఇచ్చే విధంగా కృషి చేయడం జరిగింది. అలాగే ఆరోగ్యం బాగా లేక ఇబ్బందులు పడుతున్న ఆవులమంద నరసమ్మ కి 20000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి సభ్యులు పాల్గొని ఆమెకు ధైర్యం చెప్పారు. ఇందుకు కృషి చేసిన కూటమి సభ్యులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# ధనలక్ష్మి రూపంలో అమ్మవారు

**(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 13)**

ప్రకాశం జిల్లా కంభం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. రూ. కోటి 13 లక్షల నగదు రూ.500, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నూతన కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అమ్మవారిని అలంకరించారు. ధనలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

# అబ్దుల్ యూత్ ఫర్ హెల్ప్ సేవా సంఘం లోక ఫౌండేషన్ కు విజ్ఞప్తి



**(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, అక్టోబర్ 13)**

మండలంలోని యువకులు మరియు క్రీడాకారులతో కలిసి శ్రీ అమ్మ భగవాన్ ఆశ్రమానికి చెందిన లోక ఫౌండేషన్ నిర్వాహకులకు అబ్దుల్ విజ్ఞప్తి చేస్తూ వీడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా శ్రీ అమ్మ భగవాన్ ఆశ్రమం తరపున లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని మండలంలోని ముఖ్యంగా యువతపై దృష్టి పెట్టి వారు శారీరకంగ దృఢంగా ఉండటానికి, సమాజంలో క్రీడల్లో యువత రాణించాలనే ఉద్దేశంతో, గ్రామీణ స్థాయి లోని క్రీడా నైపుణ్యం కలిగిన యువకులను వెలికి తీసి ఇటు జిల్లా అటు రాష్ట్రస్థాయిలో యువత రాణించాలన్న ఉద్దేశంతో క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడ సంబరాలు, క్రీడా కార్యక్రమాలు చేశారని వాటి వలన మంచి ఫలితాలు వచ్చి చాలామంది జిల్లా రాష్ట్రస్థాయిలో క్రీడలకు ఎంపికయ్యారని, అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా చేరడం కూడా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం గత నాలుగు సంవత్సరాలుగా లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా కార్యక్రమాలు స్తంభించాయని తిరిగి వాటిని ప్రారంభించి స్థానికంగా ఉండే యువత క్రీడల్లో రాణిస్తూ ఇటు ఆరోగ్యపరంగా శారీరకంగా. దృఢత్వాన్ని పెంచుకొని, మరోవైపు క్రీడా నైపుణ్యం ఉన్న యువకులను రాష్ట్రస్థాయికి జిల్లా స్థాయిలో రాణించే విధంగా తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ అమ్మ భగవాన్ ఏకం ఆశ్రమం ఏ కార్యక్రమం తలపెట్టిన అందులో మంచి ఫలితాలు వస్తున్నాయి. అవి సేవా కార్యక్రమాలు కానీయండి, స్వయం ఉపాధి మహిళలు పొందే కార్యక్రమం కానీయండి, యువకులను ప్రోత్సహిస్తూ క్రీడలలో ఉద్యోగాల్లో రాణించడం కోసం వారు చేసిన కృషి చాలానే ఉంది. మండలంలోని యువత సోషల్ మీడియాకి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారి మైండ్ సెట్ ని డైవర్ట్ చేస్తూ వారికి అనేక రంగాల్లో శిక్షణ ఇవ్వడం చాలా అవసరం. అందులో క్రీడారంగం కూడా చాలా కీలకం చాలామంది యువకులు కూడా తిరిగి లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు ఎప్పుడు ప్రారంభిస్తారు అని ఎదురుచూస్తున్నాడం గమనార్హం. ప్రత్యేకించి మండలంలో ఒక క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది ప్రభుత్వ శాఖా పరంగా స్థలాన్ని నిర్ణయిస్తే బాగుంటుంది. అది కూడా లోక ఫౌండేషన్ చొరవ తీసుకోవాలని క్రీడాకారుల కోరిక.

## పెళ్లికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం



**(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 13)**

నాయుడుపేట మండలం నరసారెడ్డి కండ్రిగ గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సూళ్లూరుపేటలో జరిగిన వివాహానికి హాజరై తిరిగి అన్నమేడు గ్రామానికి ఆటోలో వెళ్తుండగా కారు ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న అన్నమేడు గ్రామానికి చెందిన ఆరుగురు గాయపడగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని వాహనము ఢీకొని లారీ డ్రైవర్ మృతి



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 13)**

మండల పరిధిలోని కొల్లూరుపాడు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద వరంగల్ నుండి తమిళనాడుకి లారీ బయలుదేరింది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ లారీని ఆపి మిరపకయల బస్తాలకి కట్టిన తాడు సరిచేసుకునే క్రమంలో 12వ తేదీ అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో లారీ డ్రైవర్‌కి తీవ్ర రక్త గాయాలు కావడంతో ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు 108 అంబులన్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో మురుగన్ గుణాలన్ (30) మృతి చెందాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె అంకమ్మ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విజేతలకు బహుమతులు అందజేత







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

ఒంగోలు మినీ స్టేడియంలో జరుగుచున్న మూడవరోజు టేబుల్ టెన్నిస్ ఫైనల్ గేమ్ హెూరా హెూరిగా జరిగాయి. పురుషులు, మహిళా విభాగలకు ఉత్తమ ప్రదర్శన కనపరచిన అండర్ 15 విన్నర్ మహిళా విభాగంలో యం శాంతి జ్యోతి కి ముఖ్య అతిధి విజయ ప్రకాష్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఏపి స్టేట్ ఒంగోలులో 5వ టోర్నమెంట్ జరపటం సంతోషంగా ఉందన్నారు. ఇంత ఉత్సాహంతో టీటీ గేమ్ జరిపిన నిర్వహులు చైర్మన్ ఎస్ కిషోర్ కుమార్, టీటీ ప్రసిడెంట్ ప్రియా గారిని, సెక్రటరీ రవిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నానన్నారు. రన్నర్, విన్నర్‌గా గెలుపొందిన డి దీక్షితాకు ప్రసిడెంట్ ప్రియా చేతులమీదుగా బహుమతి అందించారు. అతిధిగా విచ్చేసిన మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ గేమ్ ఒంగోలులో జరపటం, ఇంత గొప్పగా మూడు రోజులు అద్భుతంగా నిర్వహించిన ఏజె సొల్యూషన్ ఎండి ప్రియాని ఒంగోలు అభివృద్ధి కమిటీ సభ్యునిగా అభినందిస్తున్నానన్నారు. మండవ లావణ్య టీడిపి పార్లమెంట్ మహిళా అధ్యక్షులు, కొచూరి శ్రీదేవి, సుజాత రెడ్ క్రాస్ అధ్యక్షులు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టీటీఏ ఉపాధ్యక్షులు హజీరా బేగం, జలీల్, జైభీమ్ కిరణ్, టీటీ కోచ్‌లు, రిఫరీలు, తదితరులు పాల్గొన్నారు.

## అతి తక్కువ ధరలకే టెంపుల్ సిటీ వెంచర్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)**

ఒక్క ధనికులే కాక పేదవారు కూడా ఇంటి స్థలము కొనుక్కునేందుకు తమ టెంపుల్స్ సిటీ వెంచర్ అవకాశాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రూరల్ మండలంలోని అలికేపల్లి నిర్వాహకులు వెంచర్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు సిటీకి అత్యంత కోతబేటు దూరంలో వెంచర్ను నిర్వాహకులు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఒక ధనుకులే కాక పేదవారు కూడా ఈ వెంచర్ లో స్థలం ఉపయోగించి ఇల్లు కట్టుకోవడం వీలవుతుందన్నారు. అంతేగాక ఈ వెంచర్ల స్థలం కొనేందుకు బ్యాంకు ద్వారా కూడా సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కనుక ఈ వెంచర్ను ప్రతి ఒక్కరు జిల్లా ప్రజలు ఉపయోగించు కోవాలన్నారు. వెంచర్ల స్థలముకున్న వారికి విద్యుత్ సౌకర్యంతో పాటు పిల్లకాయలు ఆడుకునేందుకు ఆటస్థలం మిగతా అన్ని సౌకర్యాలు పొందుపరచున్నాయన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు పట్టణంలోని ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.









## శ్రీ మహిశాసురమర్ధినిగా అమ్మణ్ణి కి గ్రామోత్సవం

### సారె సమర్పించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే దంపతులు



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, అక్టోబర్ 13)**

రాష్ట్రంలోని ప్రముఖ శక్తి దేవాలయాలలో ఒకటిగా పేరుగాంచిన సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో గడిచిన తొమ్మిది రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగించారు. 10వ రోజు అమ్మణ్ణికి మహిశాసుమర్దిని అలంకారంతో సూళ్లూరుపేట గ్రామోత్సవం నిర్వహించారు. చివరి రోజు వేడుకల్లో భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు సారెను తీసుకు వచ్చారు. ఆలయం వద్ద ఆమెకు సహాయక కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలికారు. గాలిగోపురం వద్ద నుండి సారె తీసుకొని మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో ముందుగా చెంగాళమ్మ చెట్టు వద్దకు చేరుకొని అక్కడ పసుపు, కుంకుమతో పూజలు చేసిన అనంతరం ఆలయం ముందున్న సూలం వద్ద కూడా పూజలు చేసి గర్భాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి పసుపు కుంకుమ సారెను సమర్పించారు. ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు భర్త పార్థసారధి, ఎమ్మెల్యే తండ్రి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం కూడా ఉన్నారు. ఈ సందర్భంగా అమ్మణ్ణి ఎదుట ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సహాయక కమిషనర్ చేతులు మీదగా ఆలయ మర్యాదలు అందజేశారు. అనంతరం ఉభయదాతలు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల సహాయ, సహకారాలతో అమ్మణ్ణికి మహిశాసురమర్ధిని అలంకారం చేసి అలంకార పూజలు చేశారు. వేదపండితులు దసరా ఉభయదాతల చేత కుంకుమ పూజలు చేయించారు. ఈ వేడుకల్లో చివరి ఘట్టంగా అమ్మణ్ణి మహిశాసురమర్ధిని అలంకారంతో రాత్రి పది గంటలకు గ్రామోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించారు,ఈ వేడుకల్లో తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పచ్చవ మాధవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## దశమి రోజున భ్రమరాంబిక దేవి అనుగ్రహం

### ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)**

దేవి శరన్నవరాత్రి మహెూత్సవాలలో శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబిక దేవి దశమి రోజు పరిపూర్ణమైన రూపంలో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహిస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. దేవి శరన్నవరాత్రి మహెూత్సవాల్లో భాగంగా శ్రీశైల దేవస్థానంలోని ధర్మనిధి వేదికపై ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమంలో పొన్నూరు వేంకట శ్రీనివాసులు దేవి శరన్నవరాత్రి వైభవం పై ప్రసంగించారు.

నవదుర్గలుగా అమ్మవారిని తొమ్మిది రోజు ఆరాధించడం వలన మానవుల్లో ఉన్న అసుర శక్తులు నశించిపోయి నరుడు నరోత్తముడుగా మారుతాడని అన్నారు. దేవీ నవరాత్రుల్లో శక్తి ఆరాధన వాక్కుని, శక్తిని, ఐశ్వర్యాన్ని, యశస్విని ఇస్తుందని అన్నారు. సాక్షాత్తు ఆ దుర్గాదేవి శ్రీశైలంలో భ్రమరాంబికాదేవిగా అవతరించి మహిషాసురుడిని మర్ధించిన రూపమనిన్నారు. శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకోవడం వలన పునర్జన్మ ఉండదని పేర్కొన్నారు అన్నారు. చక్కటి ఉపన్యాసం చేసిన ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులును దేవస్థానం తరుపున అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.



# పర్వతాల జస్వంత్ సాయి గౌతమ్

## జన్మదిన వేడుకల సందర్భంగా వృద్ధాశ్రమంలో అల్పాహారం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)
కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్వతాల రమేష్, కళావతి దంపతుల కుమారుడు జస్వంత్ సాయి గౌతమ్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కుమారుడు జన్మదినాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో అల్పాహారం కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు, వికలాంగులకు రమేష్, కళావతి దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా సేవ చేయాలనే సదుద్దేశంతో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం కార్యక్రమం నిర్వహించినట్టు దంపతులు తెలిపారు. వృద్ధాశ్రమంలో ఉన్న పెద్దవాళ్ళకు పర్వతాల రమేష్, కళావతి దంపతుల కుమారుడు జస్వంత్ సాయి గౌతమ్ చేతుల మీశీస్త్రగా అల్పాహారం అందజేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో ఉన్న పెద్దలు అందరూ జస్వంత్ సాయి గౌతమ్‌ని అక్షింతలు వేసి ఆశీర్వదించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకొని ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు సెక్రటరీ పెరిమిటి.చెంచయ్య,జాయింట్ సెక్రెటరీ అత్తి మంజరి గోపాల్, సభ్యులు చవల సురేంద్రబాబు,ఎస్.కె రఫీ, ఓం సాయిరాం చారిటీస్ నిర్వాహరాలు కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత చింతలమ్మకు పొంగల్



(షణ్ముఖ వెలుగు, చేజర్ల, అక్టోబర్ 13)
చేజర్ల మండలంలో యనమదాల గ్రామంలో గ్రామ దేవత చింతాలమ్మ అమ్మవారికి చిలక వెంకట శేషారెడ్డి గుడి నిర్మాణ దాత కుటుంబ సభ్యులు చిలక జితేందర్ రెడ్డి వినీత అమ్మవారికి ఆ పొంగల్లు పెట్టి నైవేద్యం సమర్పించి, గ్రామ ప్రజలకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, సర్పంచ్ సుందర్ రామిరెడ్డి, చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)
భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ ఓ ప్రకటనలో కోరారు. ఈ విషయాన్ని అర్జీదారులందరూ గమనించాలని ఆయన సూచించారు.

## కొండ్రెడ్డి సంధ్యమ్మకు ఘన నివాళి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)
నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సతీమణి కొండ్రెడ్డి సంధ్యమ్మ 11వ వర్ధంతి సందర్భంగా అల్లూరు మండలం నార్త్ మోపూరు గ్రామంలోని వారి నివాసంలో ఘన నివాళులర్పించారు. కొండ్రెడ్డి సంధ్యమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె కుటుంబ సభ్యులు ఘన నివాళులర్పించారు.

## భక్తిశ్రద్ధలతో భగవతి మల్లికాంబ అమ్మవారి నగరోత్సవం



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 13)
నాయుడుపేట మండలం అయ్యప్ప రెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భగవతి మల్లికాంబ అమ్మవారి ఆరాధన మహోత్సవాలు శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపుతో ఘనంగా ముగిశాయి. అమ్మవారి చిత్రపటంతో వాహనంలో ప్రత్యేక అలంకరణ చేపట్టి నాయుడుపేట పట్టణపురవీధుల్లో ఊరేగింపు జరిపారు. ఆలయ ధర్మకర్త అమాస రామనారాయణ ఆధ్యాత్మిక గురువులు ఓటుకునాథ స్వామి భక్తులు పాల్గొన్నారు.

## క్రీడాకారుడిని అభినందించింది ఎమ్మెల్యే విజయశ్రీ



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 13)
నాయుడుపేట పట్టణానికి చెందిన గణేష్ ముని రత్నం చైనా దేశంలో జరిగిన ఆర్చరీ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయనను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ అభినందించారు. పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్లో గణేశ్ మరెన్నో పథకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పనబాక భూలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధురాలు సుబ్బులమ్మ అంత్యక్రియలు



(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, అక్టోబర్ 13)
నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసపురంలో అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూసిన చౌటూరు సుబ్బులమ్మ అనే వృద్ధురాలు అంత్యక్రియలను పనబాక భూలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనారోగ్యంతో మృతి చెందిన చౌటూరు సుబ్బులమ్మ కుటుంబ ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన పనబాక భూలక్ష్మి సేవ సమితి సభ్యులు పనబాక గంగబాబు సేవా సమితి ఖర్చులతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

# జిల్లా ప్రజలకు అందుబాటులో గ్యాస్ట్రో వైద్యశాల

### మధ్యతరగతి ప్రజలు అన్ని విధాల ఉపయోగించుకోవాలి

### జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, అక్టోబర్ 13)
జిల్లా ప్రజలకు అందుబాటులో డాక్టర్ మధు గ్యాస్ట్రో హాస్పిటల్ తీసుకొని వచ్చారని ఈ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలను జిల్లాలోని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి పెంచలయ్య తెలిపారు. నెల్లూరు పట్టణంలోని విజయ మహల్ గేట్ అండ్ బ్రిడ్జి వద్ద నూతన ఆసుపత్రి భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నెల్లూరు పట్టణంలో 12 లక్షల మంది ప్రజలు ఉన్నారని జిల్లా మొత్తం మీద 26 లక్షల మంది ప్రజలు ఉంటున్నారని వీరందరికీ కూడా ఆస్పత్రిలో సేవలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఇటీవల కాలంలో గ్యాస్ట్రో వ్యాధితో బాదుకుని బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని ఆయన అన్నారు. అత్యధికమైన వసతులతో నూతన టెక్నాలజీతో ఈ ఆసుపత్రి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ఆస్పత్రిలో వివిధ భువన సముదాయాలను డాక్టర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖ వైద్యులతో పాటు అత్యధిక సంఖ్యలో రోగులు కూడా పాల్గొని మొదటి రోజు వైద్య సౌకర్యం పొందడం జరిగింది. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ మధు తోపాటు. పట్టణంలోని సీనియర్ వైద్యులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ప్రజలు, పలువురు సీనియర్ వైద్యులు, డాక్టర్ మధుని అభినందించారు.




# వేడుకగా శ్రీవారి తిరు వీధి ఉత్సవం

### అలరించిన కోలాట ప్రదర్శన

### ముగిసిన శ్రీగిరి శ్రీవారి శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి తోమాల సేవ, సహస్ర నామార్చనతో పాటు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారు ఉభయ దేవేరులతో శ్రీగిరి తిరు వీధులలో విహరించారు. శ్రీవారి తిరు వీధి ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసారు. శ్రీవారిని కనులారా దర్శించి భక్తితో ప్రణమిల్లారు.



అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణా రావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మి కుమారిలతో పాటు ఆలూరు జై శంకర్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అంద చేసారు.

## గ్రంధాలయాల్లో చదవడం మాకు ఇష్టం కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 13)
మండల కేంద్రమైన ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఉలవపాడు శాఖ గ్రంథాలయానికి అనుబంధమైనటువంటి చాకిచెర్ల బుక్ డిపాజిట్ సెంటర్లో లైబ్రేరియన్ రాణమ్మ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాల్గొని వివిధ రకాల నీతి కథల పుస్తకాలు చదివించడం జరిగింది. ఈ పుస్తకాల చదవడం వలన మంచి భావనలు నాలెడ్జ్ పెరుగుతుందని తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయానికి పంపించడం వలన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ పాలకుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకుడు డి .కోటేశ్వరరావు, చాకిచెర్ల బుక్ డిపో లైబ్రేరియన్ రాణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగేశ్వరరావు, శ్రీనివాసరావుకి జన్మదిన శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 13)
ఒంగోలు నగర తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కొఠారి నాగేశ్వరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావుకి 27వ డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి పప్పు శ్రీనివాసరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com